ప్రజాశక్తి
గురువారం 21 నవంబర్ 2024
5
అల్లూరి సీతారామరాజు



గోదాముల మరమ్మతు చేపట్టాలి

ప్రజాశక్తి- ముంచింగి పుట్టు:గిరిజన సహకార సంస్థ గతంలో నిర్మించిన గోదాముల మరమ్మతు చేపట్టాలని మండల వైస్ ఎంపీపీ 1 పాటు బోయ సత్యనారాయణ డిమాండ్ చేశారు. బుధవారం గోదామును పరిశీలించి ప్రభుత్వాన్ని తక్షణమే గోదాములను నూతన భవనాలు నిర్మించాలని డిమాండ్ చేశారు. మండల కేంద్రంలోని గోదాము శిధిల వ్యవస్థకు చేరుకోవడంతో సరుకులు పాడవుతున్నాయన్నారు. వర్షకాలంలో శ్లాబులు కారి సరుకులకు నష్టం జరుగుతుందన్నారు. వర్షానికి తడిసిన పప్పు దినుసులు, ఇతర సరుకులు పాడైపోవడంతో ప్రజలు కొనుగోలుకు వెనకాడుతున్నారని తెలిపారు.


గోదామును పరిశీలిస్తున్న వైస్ ఎంపిపి

సమస్యలు పరిష్కరించాలని..

వెలుగు విఒఎల ఆందోళన

ప్రజాశక్తి-పాడేరు:తమ సమస్యలు పరిష్కరించాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేస్తూ అల్లూరి జిల్లా కేంద్రం పాడేరులో బుధవారం ఎపి.వెలుగు విఒఏ (యానిమేటర్స్)లు ర్యాలీ నిర్వహించారు. జిల్లా కలెక్టర్ కార్యాలయం వరకు ర్యాలీ కొనసాగించి కలెక్టరేట్ వద్ద ధర్నా నిర్వహించారు. అనంతరం సిఐటియు జిల్లా ఉపాధ్యక్షుడు యస్‌బి పోతురాజు ఆధ్వర్యంలో తమ సమస్యలను పరిష్కరించాలని జిల్లా జాయింట్ కలెక్టర్ అభిషేక్ గౌడ్‌కు వినతి పత్రం అందజేశారు. యానిమేటర్స్ ఉద్యోగుల సంఘం (సిఐటియు) ఆధ్వర్యంలో ఆందోళన నిర్వహించారు.

ఈ సందర్భంగా సిఐటియు జిల్లా ఉపాధ్యక్షుడు ఎస్బీ పోతురాజు, యానిమేటర్స్ సంఘం నాయకులు మాట్లాడుతూ, ప్రభుత్వం తక్షణమే తమ సమస్యలపై స్పందించి పరిష్కారం చూపాలని డిమాండ్ చేశారు. కాలపరిమితి సర్క్యులర్ రద్దు చేయాలన్నారు. హెచ్.ఆర్ పాలసి అమలు చేయాలని, 10 లక్షల గ్రూప్ ఇన్సూరెన్స్ సౌకర్యం కల్పించాలని డిమాండ్ చేశారు.గ్రామ సంఘాల బకాయిలు చెల్లించాలని, గుర్తింపు కార్డు, యూనిఫామ్ ఇవ్వాలన్నారు. కార్యక్రమంలో పలు గ్రామాల వెలుగు వివోఏలు పాల్గొన్నారు.


పాడేరులో ఆందోళన చేపడుతున్న విఒఎలు, నాయకులు

విఒఎలకు ఉద్యోగ భద్రత కల్పించాలి

ఐటిడిఎ కార్యాలయాల ఎదుట ధర్నాలు

రంపచోడవరం:వెలుగు విఒఎలకు మూడు సంవత్సరాల కాల పరిమితి సర్క్యులర్‌ను రద్దు చేయాలని, ఉద్యోగ భద్రత కల్పించాలని, ఆరు నెలల వేతన బకాయిలు చెల్లించాలని కోరుతూ వెలుగు వివోఏల సంఘం రాష్ట్ర కమిటీ పిలుపు మేరకు బుధవారం విఒఎలు ఆందోళన చేపట్టారు. సిఐటియు ఆధ్వర్యాన ముందుగా సిఐటియు జిల్లా కార్యాలయం నుండి ఐటీడీఏ వరకు ర్యాలీ నిర్వహించి, ఐటీడీఏ వద్ద పెద్ద ఎత్తున ధర్నా చేశారు. ఈ సందర్భంగా సిఐటియు జిల్లా అధ్యక్షులు మట్ల, వాణిశ్రీ, జిల్లా ఉపాధ్యక్షులు కే.శాంతి రాజు మాట్లాడుతూ మాట్లాడుతూ గత వైసిపి ప్రభుత్వం తెచ్చిన మూడేళ్ల కాలపరిమితి సర్క్యులర్‌ను రద్దు చేస్తామని ఎన్నికల ముందు విజయవాడ ధర్నాచౌక్‌లో చేపట్టిన ఉద్యమం సందర్భంగా నాటి ప్రతిపక్ష టిడిపి తరపున వర్ల రామయ్య హాజరై చెప్పారని, కాని నేడు అధికారంలోకి వచ్చిన తరువాత మాట మార్చి మంత్రి కొండపల్లి శ్రీనివాస్ మూడేళ్ల కాలపరిమితి సర్క్యులర్ ఆధారంగా మూడేళ్లు పూర్తయిన విఒఎలను మార్చుకోవచ్చని ప్రకటన చేశారని తెలిపారు. దీంతో రాష్ట్ర వ్యాప్తంగా అనేక చోట్ల విఒఎలను తొలగిస్తున్నారని, తక్షణమే టిడిపి ఇచ్చిన హామీ మేరకు ఈ సర్క్యులర్‌ను రద్దు చేసి విఒఎలకు ఉద్యోగ భద్రత కల్పించాలని డిమాండ్ చేశారు. ఎన్నికల హామీని విస్మరించి రాష్ట్రవ్యాప్తంగా దుర్మార్గంగా 500 మంది పైబడి వివోఏలను అక్రమంగా తొలగించిందని పేర్కొన్నారు. అక్రమంగా తొలగించిన వారిని తిరిగి విధుల్లోకి తీసుకోవాలని కోరారు. మహిళ మార్టలలో బలవంతపు సరుకులు కొనుగోలు ఆపాలని, నిబంధనలకు విరుద్ధంగా వివోఏలను తొలగిస్తున్న వారిపై చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. ఈ సమస్యలను ఈనెల 30వ తేదీలోపు పరిష్కారం చేయకపోతే డిసెంబర్ 1 నుండి జిల్లా వ్యాప్తంగా విధులను బహిష్కరించి సమ్మెలోకి వెళ్లడం జరుగుతుందని వారు స్పష్టం చేశారు. కార్యక్రమంలో సిఐటియు జిల్లా ఉపాధ్యక్షులు కే శాంతిరాజు, వివోఏల సంఘం జిల్లా కార్యదర్శి అరగాటి రామకృష్ణ రెడ్డి, ఉపాధ్యక్షులు బి.నరసింహులు, నాయకులు మంగయమ్మ, కన్నబాబు, చిన్ని తల్లి, సుమారు 200 మంది వివోఏలు పాల్గొన్నారు.


రంప చోడవరంలో ఆందోళన చేపడుతున్న విఒఎలు, నాయకులు


చింతూరులో వినతిపత్రం ఇస్తున్న విఒఎలు

చింతూరు : చింతూరు డివిజన్ పరిధిలోని విఒఎలు యూనియన్ రాష్ట్ర కమిటీ పిలుపు మేరకు బుధదవారం సిఐటియు ఆధ్వర్యంలో స్థానిక బస్టాండ్ నుండి ఐటిడిఏ వరకు ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా సిఐటియు రంపచోడవరం జిల్లా ప్రధాన కార్యదర్శి పల్లపు వెంకట్ మాట్లాడుతూ వివోఎల ఉపాధిని దెబ్బతీసే మూడు సంవత్సరాలు కాలిపరిమితి సర్క్యులర్‌ను రద్దు చేయాలని డిమాండ్ చేశారు. హెచ్ఆర్ పాలసీ అమలు చేయాలని, గ్రూప్ ఇన్సూరెన్స్ సౌకర్యం, జెండర్ పేరుతో తొలగింపులు ఆపాలని కోరారు. కార్యక్రమంలో సిఐటియు మండల ప్రధాన కార్యదర్శి పొడియం లక్ష్మణ్, వివోఎల యూనియన్ జిల్లా అధ్యక్షులు గొర్రె లక్ష్మయ్య, నాలుగు మండలాల యూనియన్ లీడర్లు దూలమ్మ. దుర్గాదేవి, శ్రీను, లీలావతి, కొండమ్మ, జ్యోతి, మణి, సుందరి. బాబు రత్నకుమారి పాల్గొన్నారు.

2 వేల టన్నుల కాఫీ పల్పింగ్ లక్ష్యం

-ఐటిడిఎ పిఒ అభిషేక్

ప్రజాశక్తి - చింతపల్లి : 2 వేల మెట్రిక్ టన్నుల కాఫీ పల్పింగ్ లక్ష్యంగా నిర్దేశించామని ఐటిడిఎ ప్రాజెక్టు అధికారి వి. అభిషేక్ అన్నారు. 2024-25 ఆర్థిక సంవత్సరానికి సంబంధించి చింతపల్లిలో ఎకో కాఫీ పల్పింగ్ ప్రక్రియను బుధవారం ఆయన లాంఛనంగా ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, ఏజెన్సీలో గిరిజన రైతులు నాణ్యమైన పార్చి మెంట్ కాఫీని ఉత్పత్తి చేస్తున్నారన్నారు. ఈ ఏడాది కాఫీ పళ్ళు కిలోకు రూ.44లు రైతులకు చెల్లించడానికి నిర్దేశించామని చెప్పారు. గత ఏడాది రైతులకు రూ.44లు ముందుగా చెల్లించి అనంతరం మూడు రూపాయలు బోనస్ చెల్లించినట్లు ఈ సందర్భంగా ఆయన గుర్తు చేశారు. ఈ ఏడాది బోనస్ చెల్లించడానికి కృషి చేస్తున్నామన్నారు. పార్చ్ మెంట్ కాఫీకి రూ.285లు చెల్లించడానికి గిరిజన సహకార సంస్థ ముందుకు వచ్చిందన్నారు.350 మెట్రిక్ టన్నుల పార్చమెంట్ ఉత్పత్తి చేయగలిగితే అనుకున్న లక్ష్యాలను సాధిస్తామన్నారు. జి. మాడుగుల, జి. కె.వీధిలో కాఫీ పల్పింగ్ యూనిట్ల నిర్మాణానికి రూ.7 కోట్ల నిధులు అవసరమవు తుందని, మంజూరు చేయడానికి కేంద్ర ప్రభుత్వం సూత్రప్రాయంగా అంగీకరించిందన్నారు.350 టన్నులు పార్చ్మెంట్ ఉత్పత్తి చేయగలిగితే నిధులు రాబట్టి రెండు మండలాలలో పల్పింగ్ యూనిట్లు నిర్మాణాలు పూర్తి చేయవచ్చునన్నారు. ఏజెన్సీలో నాణ్యమైన ఆర్గానిక్ కాఫీని రైతులు సాగు చేస్తున్నారని, దీన్ని మార్కెటింగ్ చేయడానికి టాటా కాఫీ సంస్థ ముందుకు వచ్చిందన్నారు. ఈ కార్యక్రమంలో కాఫీ సహాయ సంచాలకులు ఎన్ .అశోక్, మ్యాక్స్ సంస్థ అధ్యక్ష, కార్యదర్శులు, సభ్యులు, ఉద్యాన శాఖ ఉద్యోగులు పాల్గొన్నారు.


ప్రారంభిస్తున్న పిఒ అభిషేక్


గిరిజనులతో ఐటిడిఎ పిఒ కట్టా సింహాచలం

ఎగువ ప్రాంతాల అభివృద్ధికి కృషి

- ఐటిడిఎ జిఒ కట్టా సింహాచలం

ప్రజాశక్తి-మారేడుమిల్లి

వై.రామవరం, మారేడుమిల్లి మండలాల పరిధిలోని ఎగువ ప్రాంత గ్రామాల అభివృద్ధికి కృషి చేయడం జరుగుతుందని రంపచోడవరం ఐటీడీఏ ప్రాజెక్టు అధికారి కట్టా సింహాచలం పేర్కొన్నారు. మారేడుమిల్లి, వై.రామవరం మండలంలోని కానివాడ గ్రామాన్ని బుధవారం ప్రాజెక్ట్ అధికారి సందర్శించారు. గ్రామస్తులతో సమావేశం ఏర్పాటు చేశారు. గ్రామంలోని అంగన్వాడి కేంద్రానికి భవనం ఏర్పాటు చేయాలని, కానివాడ రహదారి మరమ్మతులు చేయించాలని గ్రామస్తులు పిఒ దృష్టికి తీసుకొచ్చారు. దీనికి పిఒ స్పందించి కానివాడ రహదారికి మరమ్మతులు త్వరలో చేయించడం జరుగుతుందని చెప్పారు. అంగన్వాడి భవనం ఏర్పాటు చేస్తామన్నారు. మారేడుమిల్లి మండలం బంద గిరిజన సంక్షేమ శాఖ ఆశ్రమ పాఠశాలను ప్రాజెక్ట్ అధికారి పరిశీలించారు. విద్యార్థులకు ప్రభుత్వ నిబంధనల ప్రకారం మెనూ అమలు చేయాలని అర్థమయ్యే రీతిలో విద్యను బోధించాలని చేయాలని సూచించారు. ప్రజలకు ఎప్పటికప్పుడు అందుబాటులో ఉండి ప్రభుత్వ పథకాలు ప్రజలకు అవగాహన కల్పించాలని కోరారు. మూమెంట్ రిజిస్టర్‌లో నమోదు చేయాలని కోరారు.



సీలేరు నదిని పరిశీలిస్తున్న తహశీల్దారు రామకృష్ణ తదితరులు

సీ ప్లేన్ ఏర్పాటుకు పరిశీలన

ప్రజాశక్తి-సీలేరు

రాష్ట్రంలో పర్యాటక రంగం మరింత అభివృద్ధిలో భాగంగా విజయవాడ నుంచి శ్రీశైలం వరకు వినియోగంలోకి తీసుకురానున్న సీ ప్లేన్‌ను సీలేరు నుంచి విశాఖపట్నానికి సీలేరు నదిపై ప్రారంభించడానికి అధికారులు పరిశీలన చేపట్టారు. సీ ప్లేన్ సీలేరు నదిపై అనుకుమా లేదా అన్నదానిపై జిల్లా కలెక్టర్ ఆదేశాల మేరకు బుధవారం జికె.వీధి తహశీల్దారు రామకృష్ణ, ఇరిగేషన్ అధికారులతో కూడిన బృందం పర్యటించి సీలేరు జలాశయాన్ని పరిశీలించారు. స్థానిక మారెమ్మ ఆలయం ఎదురుగా ఉన్న స్నానపు ఘాటు మెయిన్ డ్యామ్ ప్రదేశాలను పరిశీలించారు. సీ ప్లేన్ ల్యాండింగ్‌కు టేకప్‌కు అనుకూలమైన భౌతిక భౌగోళిక పరిస్థితులు ఉన్నాయా లేదా? అనేది ఈ బృందం క్షుణ్ణంగా పరిశీలన చేశారు. ఈ సందర్భంగా తహశీల్దారు రామకృష్ణ స్థానిక విలేకరులతో మాట్లాడుతూ విశాఖపట్నం నుంచి సీలేరుకు సీ ప్లేన్ ఏర్పాటుకు 2017లోనే పరిశీలన జరిగిందని చెప్పారు. సీలేరు నది విశాలంగా లోతుగా ఉన్నట్లు గుర్తించామని, సీ ప్లేన్ ప్రయాణానికి అనుకూలంగా ఉందని నివేదిక ఇచ్చినట్లు తెలిపారు. జోలాపుట్ జలాశయంలో సీ ప్లేన్‌పై సిబ్బంది సర్వే నిర్వహించారన్నారు. జీకే వీధి మండలంలోని సీలేరు, దారాలమ్మ ఆలయం, రెయిన్ గెజ్ వంటి ప్రాంతాల్లో సాహసిద్ధమైన ప్రకృతి రమణీయ దృశ్యాలు కనువిందు చేస్తాయని చెప్పారు. ఈ కార్యక్రమంలో సర్పంచ్ పాంగి దుర్యోధ తదితరులు పాల్గొన్నారు.



షాపుల్లో బాల కార్మికులను గుర్తించేందుకు తనిఖీ చేస్తున్న పోలీసులు, అధికారులు

బాల కార్మికుల గుర్తింపు

-షాపు యజమానిపై కేసు నమోదు

ప్రజాశక్తి -పాడేరు: పాన్ ఇండియా బాల కార్మిక నిర్మూలన కార్యక్రమంలో భాగంగా కార్మిక శాఖ, ఐసీడీఎస్, పోలీస్, సర్వ శిక్ష అభియాన్ శాఖల సమన్వయంతో జిల్లా కేంద్రం పాడేరులో బుధవారం సంయుక్తంగా తనిఖీ నిర్వహించారు . ఈ తనిఖీలో భాగంగా కిరాణా షాప్ లో బాల కార్మికులను గుర్తించి షాపు యజమానిపై కేసు నమోదు చేసినట్లు సహాయక కార్మిక అధికారి పి సత్యానారాయణ స్థానిక విలేకరులకు తెలిపారు. అంతేకాకుండా తక్కువ జీతాలు చెల్లిస్తూ యువకులను బట్టల షాపుల్లో కిరాణా షాపుల్లో పెట్టుకోవడం జరుగుతుందని వారి పైన కేసు నమోదు చేసామని చెప్పారు. 18 సంవత్సరాల లోపు బాల కార్మికులను పనిచేయించ రాదని తెలియజేశారు. ఈ తనిఖీలు పోలీస్ శాఖ ఏఎస్ఐ సూరిబాబు, ఐసిడిఎస్, జిల్లా బాల సంరక్షణ విభాగం నుండి ప్రమీల, కౌన్సిలర్ జ్ఞానేశ్వరి, సర్వ శిక్ష అభియాన్ కూర్మా రావు పాల్గొన్నారు.



స్థలాన్ని పరిశీలిస్తున్న అధికారులు

బొర్రాలో పార్కింగ్ స్థలం ఏర్పాటుకు చర్యలు

ప్రజాశక్తి -అనంతగిరి: మండలంలో ప్రముఖ పర్యాటక ప్రాంతమైన బొర్రా గుహల వద్ద వాహనాల పార్కింగ్ స్థలం ఏర్పాటుకు చర్యలు చేపట్టామనీ ఇన్‌చార్జీ తహాశిల్దార్ మాణిక్యం, ఎంపిడిఓ. ఏవివి కుమార్ అన్నారు. జిల్లా సబ్ కలెక్టర్ ఆదేశాల మేరకు బుధవారం సందర్శించి పార్కింగ్ స్థలమని పరిశీలించామన్నారు.దీనిపై జిల్లా ఉన్నతాధికారులకు నివేదిక అందజెస్తామని తెలిపారు.ప్రతి రిసార్ట్స్ యాజమాన్యం కూడా ఒక రూమ్ కి రూ.500 చొప్పున మూడు నెలలకు గ్రామ పంచాయతీకి చెల్లించాలన్నారు. హెూటల్స్ యాజమాన్యం నెలకు రూ 500 రూపాయలు పంచాయతీకి చెల్లించాల న్నారు. ఈ కార్యక్రమంలో సర్పంచ్ అప్పారావు, ఎంపిటిసి అరుణ పాల్గొన్నారు.

సివిల్స్ శిక్షణకు దరఖాస్తుల గడువు పొడిగింపు

ప్రజాశక్తి -పాడేరు: యూపీపీఎస్సీ నిర్వహించే సివిల్స్‌లో ప్రిలిమ్స్, మెయిన్స్ పరీక్షలకు సంబంధించి ఉచిత శిక్షణ ఇచ్చేందుకు గాను బీసీ, ఎస్సీ, ఎస్టీ, నిరుద్యోగ అభ్యర్థులు ఈ నెల 24 వరకు దరఖాస్తు చేసుకోవచ్చని, జిల్లా బీసీ సంక్షేమ మరియు సాధికారిత అధికారి, ఎం నరసింహులు బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. దరఖాస్తు చేసుకొనే వారు ఏదైనా డిగ్రీ పూర్తి చేసి ఉండాలన్నారు. 2 ఫోటోలు, విద్యా, కుల, ఆదాయ ధ్రువీకరణ పత్రాలు, ఆధార్, పాన్ కార్డు జత పరచి ఈనెల: 24. లోపు దరఖాస్తు లను దరఖాస్తులను సమర్పించాలన్నారు. ఈనెల 27 న అభ్యర్థులకు ఎంపిక పరీక్ష ఉంటుందన్నారు. అర్హత పొందిన 100 మందికి ఏపీ స్టడీ సర్కిల్, బి.సి. భవన్, విజయవాడ లో ఉచిత శిక్షణ ఇస్తారన్నారు.

వాలంటీర్లకు ఉద్యోగ భద్రత కల్పించాలి

ఎపి గ్రామ, వార్డు వాలంటీర్స్ యూనియన్ గౌరవాధ్యక్షులు వెంకట్

ప్రజాశక్తి - చింతూరు

గ్రామ, వార్డు వాలంటీర్ వ్యవస్థను కొనసాగిస్తామని ఎన్నికల సభల్లో టిడిపి కూటమి ఇచ్చిన హామీ మేరకు వాలంటీర్లను తక్షణమే విధుల్లోకి తీసుకొని వారికి ఉద్యోగ భద్రత కల్పించాలని ఎపి గ్రామ, వార్డు వాలంటీర్స్ యూనియన్ (సిఐటియు) ఎఎస్ఆర్ రంపచోడవరం జిల్లా గౌరవాధ్యక్షులు పల్లపు వెంకట్ డిమాండ్ చేశారు. చింతూరులో బుధవారం జరిగిన యూనియన్ ముఖ్య నాయకుల సమావేశంలో వెంకట్ మాట్లాడుతూ వాలంటీర్ వ్యవస్థపై శాసనమండలిలో మంత్రి మాటను వెనక్కి తీసుకోవాలని, వాలంటీర్లకు ఎన్నికల్లో ఇచ్చిన హామీ మేరకు రూ.10వేలు గౌరవ వేతనం ఇవ్వాలని డిమాండ్ చేశారు. లేకుంటే రాబోయే రోజులలో అసెంబ్లీని ముట్టడిస్తామని హెచ్చరించారు. ఈ సమావేశంలో సిఐటియు మండల కార్యదర్శి పొడియం లక్ష్మణ్, యూనియన్ రాష్ట్ర కమిటీ సభ్యులు పొడియం జానీ, మండల కార్యదర్శి కలముల మహేష్, సోడి ప్రసాద్, గంగరాజు, సత్యనారాయణ, తదితరులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న ఎపి గ్రామ, వార్డు వాలంటీర్స్ యూనియన్ జిల్లా గౌరవాధ్యక్షులు వెంకట్

వాలంటీర్లకు పెండింగ్ వేతనాలు చెల్లించాలి

విఆర్.పురం : వాలంటీర్ల పట్ల టిడిపి కూటమి ప్రభుత్వ నిర్లక్ష్యం సరికాదని ఎపి ఆదివాసీ గిరిజన సంఘం రంపచోడవరం జిల్లా కార్యదర్శి పులి సంతోష్‌కుమార్, ఏపీ గ్రామ వార్డు వాలంటీర్స్ యూనియన్ రాష్ట్ర కమిటీ సభ్యులు పొడియం జానీ అన్నారు. మండలంలో బుధవారం జనార్ధన్‌రెడ్డి అధ్యక్షతన జరిగిన సదస్సులో వారు మాట్లాడుతూ పెండింగ్ వేతనాలు వెంటనే చెల్లించాలని, వాలంటీర్లను విధుల్లోకి తీసుకోవాలని డిమాండ్ చేశారు. ఎన్నికల హామీ మేరకు నెలకు రూ.10వేలు వేతనం చెల్లించాలని, నాలుగు నెలల పెండింగ్ వేతనం రూ.10వేలు చొప్పున రూ.40వేలు ఇవ్వాలని కోరారు. లేకుంటే సిఐటియు ఆధ్వర్యంలో రాష్ట్ర వ్యాప్తంగా ఆందోళన చేస్తామని హెచ్చరించారు. అనంతరం యూనియన్ మండల కమిటీ ఎన్నిక జరిగింది. మండల అధ్యక్ష కార్యదర్శులుగా కథల జనార్దన్‌రెడ్డి, కుడియం వెంకటేష్, ఏడుగురు కార్యదర్శివర్గం, 20 మందితో మండల కమిటీ ఎన్నిక జరిగింది.

రైతులకు అందుబాటులో ధాన్యం కొనుగోలు కేంద్రాలు

రంపచోడవరం సబ్ కలెక్టర్ కల్పశ్రీ

ప్రజాశక్తి- దేవీపట్నం

రైతులకు అందుబాటులో ప్రభుత్వం ధాన్యం కొనుగోలు కేంద్రాలను ఏర్పాటు చేసిందని, రైతులు పండించిన పంటను కేంద్రాల ద్వారా కొనుగోలు చేయడం జరుగుతుందని, రైతులు ఈ అవకాశాన్ని ఉపయోగించుకోవాలని రంపచోడవరం సబ్ కలెక్టర్ కల్పశ్రీ అన్నారు. దేవీపట్నం మండలం ఇందుకూరుపేట గ్రామంలో ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని బుధవారం సబ్ కలెక్టర్ ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ, ఈ ప్రాంతంలో ఎక్కువగా వరి పండిస్తున్న కారణంగా మొదటిగా ఇక్కడ కొనుగోలు కేంద్రం ప్రారంభిస్తున్నట్లు చెప్పారు. ప్రభుత్వం ద్వారా రైతులకు గిట్టుబాటు ధర కల్పిస్తున్నామని, ఏమైనా సమస్యలు ఉంటే అధికారులు దృష్టికి తీసుకురావచ్చని చెప్పారు. గోనె సంచులు అందుబాటులో ఉంటాయని, రవాణా ఇబ్బందులు లేకుండా చర్యలు తీసుకుంటామని పేర్కొన్నారు. ధాన్యం కొనుగోలుకు సంబంధించి సమస్యలు ఏమైనా ఉంటే మండల తహశీల్దార్, వ్యవసాయశాఖ అధికారి దృష్టికి తీసుకెళ్లాలని సూచించారు. అక్కడ పరిష్కారం కాకపోతే రంపచోడవరంలో సబ్ కలెక్టర్ కార్యాలయానికి వచ్చి సమస్యలను వివరించవచ్చని తెలిపారు. కార్యక్రమంలో స్థానిక నాయకులు, వివిధ శాఖల అధికారులు పాల్గొన్నారు.


ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని ప్రారంభిస్తున్న రంపచోడవరం సబ్ కలెక్టర్ కల్పశ్రీ


మౌనికను అభినందిస్తున్న ప్రిన్సిపల్ కృష్ణారావు తదితరులు

వెయిట్ లిఫ్టింగ్‌లో ఏకలవ్య విద్యార్థిని ప్రతిభ

ప్రజాశక్తి-రాజవొమ్మంగి

స్థానిక ఏకలవ్య పాఠశాలలో తొమ్మిదో తరగతి చదువుతున్న గిరిజన బాలిక మౌనిక వెయిట్ లిఫ్టింగ్‌లో రాష్ట్రస్థాయిలో రెండవ బహుమతి సాధించింది. ఈనెల 15న స్కూల్ గేమ్స్ ఫెడరేషన్ ఆధ్వర్యంలో గుడివాడలో జరిగిన అండర్ 19 విభాగంలో వెయిట్ లిఫ్టింగ్‌లో మౌనిక విశేష ప్రతిభ కనబరిచి రాష్ట్రస్థాయిలో రెండవ స్థానంలో నిలిచిందని పాఠశాల ప్రిన్సిపల్ ఎంవి కృష్ణారావు బుధవారం విలేకరులకు తెలిపారు. ఈ మేరకు మౌనికను ప్రిన్సిపల్ ఎంవీ కృష్ణారావు, ట్రైనర్ మాణిక్యాలరావు, పాఠశాల సిబ్బంది, విద్యార్థులు అభినందించారు.

విద్యుత్ కాంట్రాక్టు కార్మికుల సమస్యలపై వినతి

ప్రజాశక్తి-మోతుగూడెం

సీలేరు కాంప్లెక్స్ విద్యుత్ కాంట్రాక్టు కార్మికుల సమస్యలను పరిష్కరించాలని చింతూరు మండలం, మోతుగూడెంలో ఏపీ జెన్కో చీఫ్ ఇంజనీర్‌కు సిఐటియు ఆధ్వర్యాన బుధవారం వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా సిఐటియు నాయకులు మాట్లాడుతూ 20 సంవత్సరాలు నుండి విద్యుత్ సంస్థలో పనిచేస్తున్న వారిని డైరెక్టర్ పేమెంట్ చేయాలని అర్హతను బట్టి పర్మినెంట్ చేయాలని కోరారు. పనిని బట్టి స్కిల్డ్, సెమీస్కిల్డ్‌గా పరిగణించి జీతాలు చెల్లించాలని, ఖాళీగా ఉన్న ఏపీ జెన్‌కో ఇళ్లను అద్దె ప్రాతిపదికన కాంట్రాక్టు కార్మికులకు ఇవ్వాలని, ఎపి జెన్కో ఆసుపత్రిలో వైద్య సదుపాయం కల్పించాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో సీఐటీయూ రీజనల్ సెక్రెటరీ రత్నాకర్, బివి రమణ, కాంట్రాక్టు కార్మికులు పాల్గొన్నారు.


జెన్‌కో చీఫ్ ఇంజనీర్‌కు వినతిపత్రం ఇస్తున్న కాంట్రాక్టు కార్మికులు


కోతలు కోస్తున్న గిరిజనులు

ముమ్మరంగా వరి కోతలు

ప్రజాశక్తి - చింతపల్లి : మన్య ప్రాంతంలో వరి కోతలు ముమ్మరంగా జరుగుతున్నాయి. వరి సాగు ప్రారంభ దశలో అల్పపీడన ప్రభావంతో విస్తారంగా వర్షాలు కురవడంతో పంట నష్టం జరుగుతుందని ఆల్లాడిన గిరి రైతులు ఆశించిన రీతిలో పండి కోతకు రావడంతో గిరి రైతులు వరి కోతలకు సమాయత్తం అయ్యారు. ఈ దశలో గడచిన మూడు నాలుగు రోజుల క్రితం అల్పపీడనం ఏర్పడి ఆకాశం మేఘావృతం కావడమే కాక మన్య ప్రాంతంలో ఒకటి రెండు రోజులు విస్తారంగా వర్షాలు కురిసాయి. దీంతో అక్కడక్కడ వరి పంట కోత కోసిన గిరి రైతాంగం చేసేదేమీ లేక తలలు పట్టుకున్నారు. మిగిలిన రైతాంగం పంట పండినప్పటికీ అల్పపీడన ప్రభావం తగ్గాక కోతలకు ఉపక్రమించవచ్చునని భావించారు. ఈ దశలో అల్పపీడన ప్రభావం తొలగిపోయి చలి ప్రభావం పెరగడంతో గిరి రైతులు వరి కోతలకు ఉపక్రమించారు.గడచిన రెండు రోజులుగా చింతపల్లి, జికే వీధి మండలాలతో సహ మన్యంలోని అన్ని మండలాలలో వరి కోతలు ముమ్మరంగా జరుగుతున్నాయి.


అధికారులతో మాట్లాడుతున్న కుమార్

పారిశుధ్యాన్ని మెరుగుపరచండి

డివిజనల్ పంచాయతీ అధికారి కుమార్


ప్రజాశక్తి -పాడేరు: జిల్లా కేంద్రం పాడేరు సమీపంలోని ప్రముఖ పర్యాటక ప్రదేశం వంజంగి హిల్స్ ప్రాంగణంలో పారిశుధ్య నిర్వహణ ప్రక్రియంగా చేపట్టి, పర్యావరణాన్ని కాపాడాలని డివిజనల్ పంచాయతీ అధికారి పిఎస్.కుమార్ పంచాయతీరాజ్ ఉద్యోగులకు సూచించారు. బుధవారం సాయంత్రం ఆయన వంజంగి గ్రామాన్ని సందర్శించి , పారిశుధ్య పనులను పర్యవేక్షించారు. అదనపు పారిశుధ్య సిబ్బందిని ఏర్పాటు చేసుకొని - పాడేరు నుండి మేఘాల కొండ వరకూ రోజు వారీ పారిశుధ్య పనులు చేపట్టాలన్నారు., ప్లాస్టిక్ వ్యర్ధాలను ఎప్పటికప్పుడు తొలగించి పర్యాటకులకు ఎటువంటి అసౌకర్యం కలుగకుండా చూడాలని సూచించారు. వంజంగిలో ప్రయివేటు వ్యక్తులు ఏర్పాటు చేసిన రిసార్ట్ లు ,టెంట్స్ క్రమబద్దీకరించాలని - పర్యాటకుల నుండి విధిగా గుర్తింపు కార్డులు సేకరించాలని సూచించారు.రిసార్ట్లు నిర్వహించాలని, ప్రతీ రిసార్ట్ వద్ద సి.సి కెమెరాలు ఏర్పాటు చేయించడానికి యజమానులను అవగాహన కల్పించాలని సూచించారు. ఈ కార్యక్రమంలో యం.పి.డి ఓ డేవిడ్ రాజు, ఈవో ఆర్ డి రమేష్ పాల్గొన్నారు .

ఘనంగా గౌరీ పరమేశ్వరుల సారె ఊరేగింపు

ప్రజాశక్తి-పాడేరు:జిల్లా కేంద్రం పాడేరు పట్టణంలో గౌరీ పరమేశ్వరుల సారె ఊరేగింపు కార్యక్రమాన్ని మహిళలు కనుల పండుగగా నిర్వహించారు. గౌరీ సేవా సంఘం ఆధ్వర్యంలో పాడేరులో కార్తీక మాసాన్ని పురస్కరించుకుని గత మూడు వారాలుగా రోజులుగా గౌరీ పరమేశ్వరుల మహోత్సవాలను నిర్వహిస్తున్నారు. ఈ కార్యక్రమంలో మహిళలు అధిక సంఖ్యలో పాల్గొన్నారు.

విద్యా ప్రమాణాలు మెరుగుపడాలి

ఐటిడిఎ ప్రాజెక్ట్ అధికారి వి.అభిషేక్


విద్యార్థికి ప్రశ్నలు వేస్తున్న పిఒ అభిషేక్

ప్రజాశక్తి -జి.మాడుగుల: మండలంలో ఆశ్రమ పాఠశాలల్లో విద్యార్థుల విద్యా సామర్థ్యాలు మరింత మెరుగుపడాలని ఐటిడిఎ ప్రాజెక్ట్ అధికారి వి .అభిషేక్ స్పష్టం చేశారు. మండలంలోని గెమ్మిలి ప్రభుత్వ గిరిజన సంక్షేమ బాలుర ఆశ్రమ పాఠశాలను బుధవారం ఆయన సందర్శించారు. ఈ సందర్భంగా 9,10 తరగతుల విద్యార్థులకు గణితం, ఆంగ్లం, సాంఘిక శాస్త్రం పాఠ్యాంశాలను బోధించారు. విద్యార్థులు ఆంగ్లం, గణిత శాస్త్రంలో మెరుగుపడాలని ఉపాధ్యాయులను ఆదేశించారు. విద్యార్థుల మెనూపై ఆరా తీశారు. ప్రతిరోజు నిర్దేశించిన మెనూ సక్రమంగా అమలు చేయాలని ఆదేశించారు. విద్యార్థుల ఆరోగ్యంపై ప్రత్యేక శ్రద్ధ తీసుకోవాలని సూచించారు. స్కూల్ కాంప్లెక్స్ పరిధిలో జరుగుతున్న ఉపాధ్యాయుల సమావేశంలో పాల్గొన్నారు. విద్యార్థుల బేస్ లైన్ పరీక్షలపై ఆరా తీశారు. విద్యార్థుల పఠన సామర్థ్యాలను పరిశీలించి ఎబిసిడి గ్రూపులుగా విభజించి ప్రత్యేక శ్రద్ధ చూపించాలని చెప్పారు. సిడి గ్రూపులో విద్యార్థుల సమర్ధాలు మెరుగుపరచడానికి ఉపాధ్యాయులు కృషి చేయాలని చెప్పారు. ప్రతి విద్యార్థికి ఆధార్ కార్డు ఉండేలా చర్యలు తీసుకోవాలన్నారు.అనంతరం గెమ్మిలి ప్రాథమిక ఆరోగ్య కేంద్రాన్ని తనిఖీ చేశారు. ఆసుపత్రి ఓపిని అడిగి తెలుసుకున్నారు. లేబరేటరీ, ఫార్మసీ లను పరిశీలించారు. గెమ్మిలి గ్రామంలో తాగునీటి సమస్యను పరిష్కరించాలని గ్రామస్తులు ప్రాజెక్ట్ అధికారి దృష్టికి తీసుకురాగా ఆయన సానుకూలంగా స్పందించారు. కొత్తపల్లి జలపాతాన్ని సందర్శించారు. ఈ కార్యక్రమంలో పలు శాఖల అధికారులు పాల్గొన్నారు.


ఎంపిడిఒ శ్రీనివాసరావును సత్కరిస్తున్న ప్రజాప్రతినిధులు

ఎంపిడిఒగా శ్రీనివాసరావు

ప్రజాశక్తి - చింతపల్లి : చింతపల్లి ఈఓపిఆర్డీగా విధులు నిర్వర్తిస్తూ ఇంచార్జ్ ఎంపీడీవోగా పనిచేస్తున్న శ్రీనివాసరావు బుధవారం చింతపల్లి ఎంపీడీవోగా పూర్తి బాధ్యతలు స్వీకరించారు. ఈ సందర్భంగా ఎంపీడీవో మాట్లాడుతూ, మండలంలో సమస్యల పరిష్కారానికి కృషి చేస్తానన్నారు. ఎంపీపీ కోరాబు అనూష దేవి, జడ్పిటిసి పోతురాజు బాలయ్య, సర్పంచ్ ల ఫోరం అధ్యక్షులు దురియా పుష్పలత లు మాట్లాడుతూ, ప్రజా ప్రతినిధులు, అధికారులు సమన్వయం చేసుకొని మండల అభివృద్ధికి కృషి చేయాలన్నారు. ఈ కార్యక్రమంలో వైస్ ఎంపీపీలు గోపి నాయక్ శారద, సాగిన వెంగళరావు పాల్గొన్నారు.

ముగిసిన గ్రంథాలయ వారోత్సవాలు


హుకుంపేట మండలంలో....

ప్రజాశక్తి -హుకుంపేట:మండలంలోని గ్రంథాలయ వారోత్సవాల సందర్భంగా పిల్లలకు క్విజ్, మ్యూజిక్ చైర్, డ్రాయింగ్, తదితర ఆటలు పోటీలు బుధవారం నిర్వహించారు. గెలుపొందిన పిల్లలకు ఆదివాసి గిరిజన మహిళ సంఘం జిల్లా కార్యదర్శి ఎస్. హైమావతి చేతుల మీదుగా బహుమతులు ప్రధానం చేశారు. అనంతరం ఆమె మాట్లాడుతూ, గ్రంథాలయం లోని చదువుకు నేందుకు అన్ని రకాలుగా వీలుంటుందని, విద్యార్థులు ఖాళీగా ఉన్న సమయంలో గ్రంథాలయంలో పేపర్లు చదువుకునేందుకు అలవాటు చేసుకోవాలన్నారు. ఈ కార్యక్రమంలో గిరిజన సంఘం మండల కార్యదర్శి టి.కృష్ణారావు, గ్రంధాలయాధికారి ఎస్.మానస, హుకుంపేట వార్డు మెంబర్ వెంకట్, కేజీబీవీ సిబ్బంది అప్పలకొండ, మర్రి సంధ్య, తూబూరు. రామలక్ష్మి సిబ్బంది అప్పారావు పాల్గొన్నారు.

డుంబ్రిగుడ: స్థానిక జిల్లా శాఖ గ్రంథాలయంలో ఈనెల 14 నుంచి నిర్వహించిన గ్రంథాలయ వారోత్సవాలు బుధవారంతో ఘనంగా ముగిసింది. ఈ సందర్భంగా కేజీబీవీ, గిరిజన ఆశ్రమ బాలికల పాఠశాల, ప్రభుత్వ జూనియర్ కళాశాల విద్యార్థులు పాల్గొని ఆటపాటలతో సందడి చేశారు. అధిక సంఖ్యలో విద్యార్థులు పాల్గొనడంతో గ్రంథాలయంలో పండగ వాతావరణం నెలకొంది. వారం రోజులపాటు విద్యార్థులకు వివిధ రకాల పోటీలను నిర్వహించి అందులో గెలుపొందిన విద్యార్థులకు బుధవారం బహుమతులను ప్రధానం చేశారు. ఈ కార్యక్రమంలో గ్రంథాలయ అధికారిని ఎస్ సునీత, సిబ్బంది కె సుబ్బారావు, ఉపాధ్యాయులు తదితరులు పాల్గొన్నారు.

అరకులోయ:అరకులోయ ప్రభుత్వ మహిళా డిగ్రీ కళాశాలలో నిర్వహించిన గ్రంథాలయ వారోత్సవాలు బుధవారం ముగిసింది. కళాశాల ప్రిన్సిపాల్ పి.చలపతిరావు అయ్యాంకి వెంకటరమణయ్య, రంగనాధన్ చిత్రపటాల పూలమాలవేసి నివాళు లర్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, పుస్తకాలు చదవడం మరింత జ్ఞానమును సంపాదించ వచ్చున్నారు.ప్రభుత్వ డిగ్రీకళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ కె.భరత్ కుమార్ నాయక్, పొలిటికల్ సైన్స్ సీనియర్ అధ్యాపకులు కె ధర్మారావు మాట్లాడుతూ, జ్ఞానాన్ని ఆర్జించుటకు గ్రంథాలయాలు అనేవి దేవాలయాలు అని విద్యార్థునులకు తెలిపారు. గెలుపొందిన విద్యార్థినులకు కళాశాలల ప్రిన్సిపల్స్ డాక్టర్ కె.భరత్ కుమార్ నాయక్, పి.చలపతిరావు అధ్యాపకులు శశి కుమార్, బాలరాజు బహుమతులు అందజేశారు.



డుంబ్రిగుడ గ్రంథాలయంలో విద్యార్థుల ఆటపాటలు...



అరకులోయలో బహుమతులు అందిస్తున్న అతిథులు


ఎన్నికైన నూతన కార్యవర్గ సభ్యులు

రెవెన్యూ ఉద్యోగుల సమస్యల పరిష్కారానికి కృషి

ప్రజాశక్తి - చింతపల్లి : రెవిన్యూ ఉద్యోగుల సమస్యల పరిష్కారానికి కృషి చేస్తామని వీఆర్వోల సంఘం అధ్యక్ష, కార్యదర్శులుగా ఏకగ్రీవంగా ఎన్నికైన ఎస్ విష్ణు, నాగబాబు లు అన్నారు. వీఆర్వోల సంఘం డివిజన్ ఉపాధ్యక్షుడు టి సోమలింగం ఆధ్వర్యంలో రెవిన్యూ కార్యాలయం వద్ద బుధవారం నిర్వహించిన వీఆర్వోల ఎన్నిక ఏకగ్రీవంగా జరిగింది. ఈ ఎన్నికలలో ఎస్ విష్ణును అధ్యక్షునిగా, నాగబాబును కార్యదర్శిగా, పూర్ణచంద్ర రావును కోశాధికారిగా ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. సభ్యులుగా వెంకటరమణ, మానవతి, నాగమ్మ లను ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు.

రైళ్ల నెంబర్ల మార్పు

ప్రజాశక్తి - ఎంవిపి కాలనీ : ఈస్ట్ కోస్ట్ రైల్వే మార్చి–2025 నుంచి వాల్తేరు డివిజన్ ఆధారిత ఎక్స్‌ప్రెస్ రైళ్ల నెంబర్లను మార్చాలని నిర్ణయించింది. విశాఖ– కడప తిరుమల ఎక్స్‌ప్రెస్‌కు 17488 బదులు 18521, కడప–విశాఖపట్నం తిరుమల ఎక్స్‌ప్రెస్‌కు 17487 బదులు 18522గా, విశాఖపట్నం – గుంటూరు ఉదయ్ ఎక్స్ ప్రెస్‌కు 22701 బదులు 22875, గుంటూరు–విశాఖపట్నం ఎక్స్‌ప్రెస్ కు 22702 బదుకు 22876 గా, విశాఖపట్నం– కిరండూల్ నైట్ ఎక్స్‌ప్రెస్‌కు 18513, కిరండూల్–విశాఖపట్నం ఎక్స్ ప్రెస్‌కు 18514 గా సవరించారు. ఈ మార్పులు 2025 మార్చి 1వ తేదీ నుంచి అమలులోకి వస్తాయని అధికారులు తెలిపారు. విశాఖపట్నం – బనారస్ బై వీక్లీ ఎక్స్‌ప్రెస్‌కు 18311 బదులు 18523గా 2025 మార్చి 2వ తేదీ నుంచి అమలు లోకి వచ్చేలా, విశాఖపట్నం బై–వీక్లీ ఎక్స్ ప్రెస్‌కు 18312 బదులు 18524గా 2025 మార్చి 3వ తేదీ నుంచి అమలులోకి వచ్చేలా సవరించారు.

నకిలీ కుల ధ్రువీకరణలపై విచారణ


విచారణ చేస్తున్న ఎంఆర్ఐ

ప్రజాశక్తి-సీలేరు : అల్లూరి జిల్లా కలెక్టర్ ఆదేశాల మేరకు జీకే వీధి మండలం సీలేరు సచివాలయంలో బుధవారం రెవిన్యూ సిబ్బంది నకిలీ ధ్రువపత్రాలపై స్థానిక సర్పంచ్ పాంగి దుర్గ, ఎంపీటీసీ పిల్లా సాంబమూర్తి, ఉప సర్పంచ్ కే.వల్లి ప్రసాద్, కాంగ్రెస్ నాయకులు కారే శ్రీనివాస్, ఇతర గ్రామ పెద్దలు సమక్షంలో విచారణ చేపట్టారు. ఈ సందర్భంగా జీకే వీధి ఆర్ఐ మహదేవ్ స్థానిక విలేకరులతో మాట్లాడుతూ సీలేరుకు చెందిన నలుగురు వ్యక్తులు తప్పుడు కుల ధ్రువీకరణ పత్రాలు పొందినట్టు కలెక్టర్‌కు ఫిర్యాదు చేశారని, ఈ ధ్రువీకరణ పత్రాలు పొందిన వాళ్ళని పిలిపించి విచారణ చేయడం జరిగిందని తెలిపారు. జరిగిన విచారణ నివేదికను తహశీల్దారుకు సమర్పించడం జరుగుతుందని చెప్పారు. ఈ కార్యక్రమంలో వీఆర్వో స్వరూప్, కాంగ్రెస్ నాయకులు వానపల్లి అప్పారావు, టిడిపి నాయకులు బొర్రా కృష్ణ, వైసిపి నాయకులు బుజ్జి, సచివాలయ సిబ్బంది పాల్గొన్నారు.

అమెరికన్ వీసాకు దళారులను నమ్మకండి

గీతంలో యుఎస్.కాన్సులేట్ అధికారులు


మాట్లాడుతున్న అధికారి జెన్నె

ప్రజాశక్తి -మధురవాడ : అమెరికాలో ఉన్నత విద్యాభ్యాసానికి వచ్చే యువతలో భారతీయ విద్యార్థులే అధికంగా ఉన్నారని, అయితే వీసాకు దళారులను నమ్మి మోసపోవద్దని హైదరాబాద్‌లోని అమెరికన్ కాన్సులేట్ కార్యాలయం కాన్సులర్ ఇన్ఫర్మేషన్ యూనిట్ విభాగం అధిపతి ఎస్.జెన్నె సూచించారు. బుధవారం గీతం డీమ్డ్ విశ్వవిద్యాలయం స్కూల్ ఆఫ్ టెక్నాలజీలో నిర్వహించిన కార్యక్రమంలో అమెరికాలో ఉన్నత చదువులకు వీసా పొందే విధానంపై వివరించారు. అమెరికాలోని 4500 గుర్తింపు పొందిన విద్యాసంస్థలు ఉన్నాయని, వీటిలో ప్రవేశానికి ఆసక్తిగల వారు హైదరాబాద్‌లోని కాన్సులేట్ కార్యాలయంలో ఎఫ్–1 వీసా కోసం దరఖాస్తు చేసుకోవాలన్నారు. నకిలీ సర్టిఫికెట్‌లతో వీసా పొందాలనుకునే వారికి భవిష్యత్తులో అమెరికాలో ప్రవేశానికి మార్గాలు శాశ్వతంగా మూసుకు పోతాయన్నారు. వీసాకోసం జరిగే ఇంటర్వ్యూలో విద్యార్థులు సుదీర్ఘ ప్రసంగాలు చేయకుండా వీసా అధికారితో ముఖాముఖి సమాధానాలను ఇవ్వడానికి ప్రాధాన్యతను ఇవ్వాలన్నారు. విద్యార్థుల ఆంగ్లభాషా పరిజ్ఞానం, గ్రామర్ పొరపాట్లు వంటివి తాము పెద్దగా పరిగణలోకి తీసుకోమని, ముఖ్యమైన ప్రశ్నలకు ఏ విధంగా సమాధానం ఇచ్చారనేది ప్రధానమైనదన్నారు. విద్యార్థులకు వచ్చిన మార్కులు, ఆర్థిక పరిస్థితి, అమెరికాలో ప్రవేశానికి సంబంధించిన విశ్వవిద్యాలయాల పత్రాలు ముఖ్యంగా పరిశీలిస్తామన్నారు. వీసా ఇంటర్వ్యూలో విద్యార్థుల ఆందోళన, ఒత్తిడి అర్థం చేసుకుని స్నేహపూర్వకంగా వ్యవహరిస్తామన్నారు. వీసా ఇంటర్వ్యూకు కావలసిన కీలక పత్రాలను విద్యార్థులకు వివరించారు. ఇంటర్వ్యూలో వ్యవహరించాల్సిన పద్ధతులను తెలిపారు. దేశంలోని 33 కేంద్రాల ద్వారా వీసాను మంజూరు చేస్తామన్నారు. విద్యార్థుల సందేహాలను నివృత్తి చేశారు. కార్యక్రమంలో అమెరికన్ కాన్సులేట్ అధికారులు పాల్గొన్నారు. అనంతరం గీతం స్కూల్ ఆఫ్ టెక్నాలజీ డైరక్టర్ ప్రొఫెసర్ నాగేంద్రప్రసాద్ తదితరులతో సమావేశమయ్యారు.

సైబర్ నేరాలపై అవగాహన అవసరం

ప్రజాశక్తి-సీలేరు : విద్యార్థులు సైబర్ నేరాలపై పూర్తిస్థాయి అవగాహన కలిగి ఉండాలని జీకే వీధి సిఐ పి.వరప్రసాద్ అన్నారు. జీకే వీధి మండలం సీలేరు జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలను సిఐ వరప్రసాద్ బుధవారం సందర్శించి విద్యార్థులతో సమావేశమయ్యారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సైబర్ నేరగాల నుంచి ఫేక్ కాల్స్, మెసేజ్‌లు, వీడియో కాల్స్ వస్తాయని, వాటి పట్ల ప్రతి ఒక్కరు అప్రమత్తంగా వ్యవహరించాలని సూచించారు. మన దేశం నుంచి 91 ప్రారంభ నెంబర్‌తో ఫోన్ కాల్స్ వస్తే ఎటువంటి ఇబ్బంది లేదని, పాకిస్తాన్ నుంచి వచ్చిన ఫోన్ కాల్స్ 92 ప్రారంభ నెంబర్‌తో ఫోన్ కాల్స్ వస్తాయని, వాటిని ఎత్తితే అనేక సమస్యలు తలెత్తయని పేర్కొన్నారు. ఏదో ఒక నెంబర్ నుంచి ఫోన్ కాల్స్ వచ్చి మీ డేటా అడిగినప్పుడు ఆ నెంబర్‌ని బ్లాక్ లిస్టులో పెడితే సమస్యలు ఉండవన్నారు. ఎప్పుడైనా డేటా చోరీ గురై అకౌంట్లో డబ్బులు పోతే క్షణాల్లోనే 1930 టోల్ ఫ్రీ నెంబర్‌కి ఫోన్ చేస్తే మన డబ్బులు సేఫ్‌గా ఉండేలాగా సంబంధిత అధికారులు చర్యలు చేపడతారని తెలిపారు. సైబర్ నేరగాళ్ల మోసాలపై ప్రజలకు విస్తృతంగా ప్రచారం చేసి అవగాహన కల్పించే బాధ్యత తీసుకోవాలన్నారు.


విద్యార్థులతో సమావేశమైన సీఐ వరప్రసాద్

విద్యార్థులు చెడు వ్యసనాలకు బానిసలై విద్యార్థి దశలోనే జీవితాలు నాశనం చేసుకోకుండా, మంచి అలవాట్లు అలవర్చుకోవాలని సూచించారు. ఈ కార్యక్రమంలో స్థానిక ఎస్సై కే.రవీంద్ర, జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల ఉపాధ్యాయులు, పిఇటి, విద్యార్థులు పాల్గొన్నారు.

గ్రావెల్ రోడ్లకు నిధులు మంజూరు చేయాలి


ఉపాధి పీడీకి వినతిపత్రం ఇస్తున్న సర్పంచ్, ఎంపిటిసి

ప్రజాశక్తి-సీలేరు : ఏజెన్సీలోని మారుమూల గిరిజన గ్రామాలకు గ్రావెల్ రోడ్లు నిర్మాణానికి ఎన్ఆర్ఇజిఎస్ ద్వారా నిధులు మంజూరు చేయాలని గాలికొండ ఎంపిటిసి సభ్యులు, సిపిఎం మండల కార్యదర్శి అపరంగి బుజ్జిబాబు డిమాండ్ చేశారు. ఈ మేరకు ఎన్ఆర్ఇజిఎస్ పీడీ శివయ్యకు బుధవారం వినతి పత్రం అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ జీకే వీధి మండలం గాలికొండ, ఎ.దారకొండ పంచాయతీల పరిధిలో 15 గ్రామాలకు రహదారి సౌకర్యం లేక గిరిజనులు అనేక ఇబ్బందులు పడుతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. ఆయా పంచాయతీల్లో ఎన్ఆర్ఇజిఎస్ నుంచి నిధులు మంజూరు చేస్తే ముందస్తుగా గ్రావెల్‌తో రహదారులు నిర్మిస్తే గిరిజనులకు రవాణా సౌకర్యం మెరుగుపడుతుందని తెలిపారు. ఎ.దారకొండ పంచాయతీ పరిధిలో బత్తునూరు నుంచి పాత్రునిగుంట, గాలికొండ నుంచి గాలిబొర్ర, నిమ్మగొంది, నిమ్మగొంది కాలనీ వరకు, జంపర్‌లో నుండి ఎం బూసుకొండ, ఆకులూరు పనసలొద్ది గడ్డి బంద, అక్కడ నుంచి పాలచెలక, గొల్లపల్లి, చీమల గొంది గ్రామాలకు కలుపుకొని రహదారి నిర్మాణానికి నిధులు మంజూరు చేయాలని కోరారు. సర్పంచ్ బాబురావు పాల్గొన్నారు

అగ్ని ప్రమాద బాధిత కుటుంబానికి ఆర్థిక సాయం

ప్రజాశక్తి-మారేడుమిల్లి : మారేడుమిల్లి మండలం వేటుకూరు గ్రామంలో ఈనెల 19న జరిగిన అగ్ని ప్రమాదంలో ఇల్లు కాలిపోయి సర్వం కోల్పోయిన టిడిపి గ్రామ కమిటీ అధ్యక్షుడు డొక్కలూరు హేమంత్ కుమార్ కుటుంబానికి రంపచోడవరం ఎమ్మెల్యే మిరియాల శిరీష దేవి, తెలుగు యువత నియోజకవర్గం అధ్యక్షుడు మఠం విజయభాస్కర్ రూ.20వేలు ఆర్థిక సాయం అందించారు. ఈ మేరకు ఈ సాయాన్ని టిడిపి మండల అధ్యక్షుడు గురుకు శేష్‌కుమార్ ద్వారా బుధవారం అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఎమ్మెల్యే అసెంబ్లీ సమావేశాల్లో ఉన్న కారణంగా రాలేకపోయారని, విజయవాడ నుండి తిరిగి వచ్చిన తర్వాత బాధిత కుటుంబాన్ని కలిసి పరామర్శిస్తారని తెలిపారు. ఎమ్మార్వోకి పరిస్థితిని వివరించి బాధిత కుటుంబానికి ప్రభుత్వం ద్వారా ఆదుకోవాలని ఆదేశించినట్లు చెప్పారు. ఈ కార్యక్రమంలో జనసేన మండలాధ్యక్షుడు మల్లా దుర్గాప్రసాద్, టిడిపి మండల మాజీ అధ్యక్షులు బీసెట్టి అప్పాజీ, స్టేట్ మైనార్టీ సెల్ ప్రధాన కార్యదర్శి షేక్ సుభాని, టిడిపి, జనసేన నాయకులు పోడియం శ్రీనుబాబు, కర్రి సన్యాసి రెడ్డి, బీసెట్ సత్య కుమార్, అందాల సూర్యనారాయణ రెడ్డి, సారపు రాజన్న దొర, గురు హరి భాస్కర్‌రావు పాల్గొన్నారు.


ఆర్థిక సాయం అందజేస్తున్న కూటమి నేతలు

టిడ్కో ఇళ్లను లబ్ధిదారులకు అప్పగించాలి

ప్రజాశక్తి-గోపాలపట్నం : గత ప్రభుత్వం మంజూరుచేసిన లబ్ధిదారులకే టిడ్కో ఇళ్లను కేటాయించాలని సిపిఐ జిల్లా కార్యదర్శి ఆర్.శ్రీనివాస్ డిమాండ్‌చేశారు. బుధవారం స్థానిక ముత్యమాంబ గుడి నుంచి 484 సచివాలయం వరకు ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ, కూటమి ప్రభుత్వం పేదలకు ఇచ్చిన హామీ మేరకు ఇళ్ల స్థలాలు, ఇళ్లు మంజూరుచేయాలని కోరారు. కార్యక్రమంలో నాయకులు వై.త్రినాధ్, వై.రాంబాబు, ఆసిరినాయుడు, మిన్నారావు కార్యకర్తలు పాల్గొన్నారు.

గండి పోచమ్మకు గోదావరి జలాభిషేకం

ప్రజాశక్తి-దేవీపట్నం : దేవీపట్నం మండలంలో ప్రసిద్ధ పుణ్యక్షేత్రం గండి పోచమ్మ తల్లి ఆలయం వద్ద బుధవారం అమ్మవారికి గోదావరి జలాలతో అభిషేకాలు, ప్రత్యేక పూజలు నిర్వహించారు. మూడు నెలలు తరువాత అమ్మవారి దర్శనాలు ప్రారంభం కావడంతో గొందూరు గ్రామానికి చెందిన మహిళలు 108 బిందెలతో గోదావరి జలాలను తీసుకొచ్చి అమ్మవారి విగ్రహానికి జలాభిషేకం చేశారు. నేటి నుండి ప్రతి రోజూ అమ్మవారి దర్శనాలు చేసుకోవచ్చని దేవస్థానం ఈవో లక్ష్మీ కుమార్ తెలిపారు. అమ్మవారి దర్శనాలను భక్తులకు ప్రత్యేకంగా ఏర్పాటు చేసినట్లు చెప్పారు. అమ్మవారి ఆలయం చుట్టు పక్కల కొన్ని ప్రదేశాలను ఇంకా శుభ్రం చేయాల్సి ఉందని, వాటిని తక్షణమే శుభ్రం చేయాలని భక్తుల కోరారు.

అంగన్వాడీ కేంద్రంలో ఆకస్మిక తనిఖీలు


అంగన్వాడీ కేంద్రంలో పిల్లల కృత్యాలను పరిశీలిస్తున్న ఐసిడిఎస్ సూపర్‌వైజర్

ప్రజాశక్తి-సీలేరు : జీకే వీధి మండలం దుప్పిలివాడ పంచాయతీ అంగన్వాడి కేంద్రాన్ని సూపర్వైజర్ మోహిని బుధవారం సందర్శించి ఆకస్మిత తనిఖీలు నిర్వహించారు. రికార్డులు పరిశీలించి చిన్నారులకు అందుతున్న పౌష్టిక ఆహారాన్ని స్వయంగా పరిశీలించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ దుప్పిలివాడ పంచాయతీ పరిధిలో డి అగ్రహారం, కుమ్మరపల్లి, జి నేరేడుపల్లి అంగన్వాడీ కేంద్రాల్లో నాలుగ మరుగుదొడ్లు ప్రభుత్వం మంజూరు చేసిందని తెలిపారు. దారకొండ పంచాయతీ పరిధిలో చీడిగుంట అంగన్వాడీ కేంద్రాల్లో ఒకటి, గుమ్మరేవుల పంచాయతీ పరిధిలో మాదిగమల్లు అంగన్వాడికి మరొకటి మరుగుదొడ్డి మంజూరైనట్లు చెప్పారు. కార్యక్రమంలో అంగన్వాడి కార్యకర్త పార్వతి హెల్పర్ ప్రేమకుమారి పాల్గొన్నారు.

కనీస పింఛను రూ.ఐదు వేలు ఇవ్వాలి

ప్రజాశక్తి -తగరపువలస : చిట్టివలస జ్యూట్ కార్మికులకు కనీస పింఛను నెలసరి రూ.5 వేలు ఇవ్వాలని సిపిఐ భీమిలి ఏరియా సమితి కార్యదర్శి కానూరి రాంబాబు కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలను కోరారు. బుధవారం స్థానిక జిఆర్ భవన్‌లో జ్యూట్ పెన్షనర్ల సమావేశంలో మాట్లాడుతూ, పెరుగుతున్న నిత్యా వసర వస్తువుల ధరలకు అనుగుణంగా పింఛను పెంచాలని కోరారు. సమావేశంలో చిట్టివలస జ్యూట్ పెన్షనర్లు ఎం అప్పలరాజు, గోవిందరావు, రామారావు పాల్గొన్నారు

వెంకటరావుకు యాక్ట్ సభ్యుల స్వాగతం

ప్రజాశక్తి-గోపాలపట్నం : హైదరాబాద్‌కు చెందిన ప్రిన్సిపాల్ కంట్రోలర్ ఆఫ్ డిఫెన్స్ (అకౌంట్స్, పరిశోధన అభివృద్ధి) కటికల వెంకటరావుకు బుధవారం విశాఖ విమానాశ్రయంలో యాక్ట్ వ్యవస్థాపకులు, ఎస్‌సి, ఎస్‌టి ఆఫీసర్స్ ఫోరం నేషనల్ కోఆర్డినేటర్ ముళ్లపూడి ప్రభాకరరావు, యాక్ట్ ప్రతినిధులు పి.భీమారావు, జి కమలాకరరావు, కె.కార్తీక్, ఇతర నాయకులు ఘన స్వాగతం పలికారు.

23 నుంచి సయ్యద్ ముస్తాక్ అలీ క్రికెట్ టోర్నీ

ప్రజాశక్తి -మధురవాడ : దేశవాళీ టీ20 క్రికెట్ టోర్నీ సయ్యద్‌ముస్తాక్ అలీ ట్రోఫీ క్రికెట్ పోటీలను ఈనెల 23నుంచి విశాఖపట్నం పీఎంపాలెం ఎసిఎ, విడిసిఎ అంతర్జాతీయ క్రికెట్ స్టేడియం, విజయనగరంలోని పివిజి రాజు కాంప్లెక్స్, విజ్జి స్టేడియంలలో ప్రారంభం కానున్నాయని ఆంధ్ర క్రికెట్ అసోసియేషన్ (ఎసిఎ) కార్యదర్శి సానా సతీష్ బాబు తెలిపారు. వచ్చేనెల 5వ తేదీ వరకు జరగనున్న ఈ పోటీల నిర్వహణకు అన్ని ఏర్పాట్లు పూర్తి చేసినట్లు తెలిపారు. టోర్నమెంట్‌లో అసోం, రైల్వేస్, ఛండీగఢ్, పాండిచ్చేరి, విదర్భ, ఒడిశా, ఛత్తీస్‌గఢ్‌జట్లు పోటీపడనున్నాయి. ఈ మేరకు ఆయా జట్లు బుధవారం విశాఖపట్నం చేరుకున్నాయి. ఇండియా, ఐపిఎల్‌కు ప్రాతినిధ్యం వహించిన పలువురు ఆటగాళ్లు ఈ టోర్నీలో పాల్గొంటారన్నారు.